కొందరికే వందనం!



ఈ చిత్రంలో ఉన్న జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీకి చెందిన లక్ష్మికి ఇద్దరు పిల్లలు. నగరంలోని సీతమ్మధారలో గల ఓ ప్రైవేటు స్కూల్లో బాబు నాలుగో తరగతి, పాప రెండో తరగతి చదువుతున్నారు. బాబు పేరుతోనే తల్లికి వందనం డబ్బులు మంజూరయ్యాయి. జాబితాలో పాప పేరు లేదు. దీనిపై పాఠశాలలో అడిగితే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. తీరా సచివాలయానికి వెళితే ఆన్‌లైన్‌లో పాప పేరు చూపించడం లేదని వారి నుంచి సమాధానం. ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు వచ్చేస్తాయని సంబరపడ్డామని, మాకు ఒక్కరికే వచ్చాయని లక్ష్మి తెలిపింది.

పశ్చిమ నియోజకవర్గం పరిధిలో చాలా మంది పరిస్థితి ఇలానే ఉంది. ఎందుకిలా జరిగిందో తెలుసుకునేందుకు తల్లిదండ్రులు సచివాలయాలకు క్యూ కడుతున్నారు.



విద్యార్థులు

- అర్హుల జాబితాపై గందరగోళం
- సచివాలయాలకు క్యూ కడుతున్న తల్లిదండ్రులు
- గోపాలపట్నం మండలంలో 41,800 మంది విద్యార్థులు

విశాఖ విద్య: తల్లికి వందనం పథకం అమలు అంతా అస్తవ్యస్తంగా ఉంది. అర్హులైన విద్యార్థులకు సైతం డబ్బులు జమ కాలేదు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే విద్యార్థులు అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో వేలాది మంది విద్యార్థుల పేర్లు కనిపించకపోవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. మాకెందుకు డబ్బులు రాలేదని స్కూళ్లు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అసలు కొంతమంది పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అంతా అంకెల గారెడీ

ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకున్నా వారందరికీ రూ.15 వేల చొప్పున మంజూరు చేశామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా కనిపిస్తుంది. గోపాలపట్నం మండలంలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 పాఠశాలలు ఉండగా వీటిలో సుమారుగా 8,800 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదే విధంగా ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 103 స్కూళ్లు ఉండగా వీటిలో 33 వేల మంది చదువుతున్నారు. వీరు కాకుండా ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు 10 వేలకు పైగానే ఉంటారు. అయితే , వీరిలో ఎంతమంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులు అనే లెక్కపై క్లారిటీ లేదు. మండలంలో ఎంతమందికి తల్లికి వందనం పథకం మంజూరైందనే వివరాలు సంబంధిత శాఖల అధికారుల వద్ద లేకపోవడం విశేషం.



బుచ్చిరాజుపాలెం సచివాలయంలో జాబితా చూసుకుంటున్న తల్లిదండ్రులు

తల్లికి వందనం అందరికీ ఇవ్వాలి



సూపర్ సిక్స్ హామీలు అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైంది. అందరికీ తల్లికి వందనం డబ్బులు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కోతలు పెడుతున్నారు. గతంలో అమ్మ ఒడి డబ్బులు వచ్చిన వారికి కూడా ఇప్పుడు ఇవ్వడం లేదు. తల్లులను మోసం చేయడం తగదు. దీనిపై కలిసొచ్చే సంఘాలతో ప్రజా ఉద్యమాలు చేస్తాం.

– పేడాడ జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు

సచివాలయంలో సంప్రదించాలి



అర్హులు అందరికీ తల్లికి వందనం డబ్బులు వస్తాయి. ఎవరికైనా డబ్బులు జమకాకపోతే తగిన ధ్రువీకరణ పత్రాలతో సచివాలయంలో సంప్రదించాలి. డబ్బులు పెండింగ్‌లో ఉన్న 96 మంది విద్యార్థుల జాబితా మాకు వచ్చింది. వారి అర్హతలు మేరకు పథకం మంజూరు చేసేలా పాఠశాలల వారీగా పరిశీలన చేస్తున్నాం.

–దివాకర్, ఎంఈవో, గోపాలపట్నం

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో కొలువై ఉన్న ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులకు ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

జనతాకాలనీలో అంధకారం



జనతాకాలనీలో వెలగని వీధిలైటు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి జనతా కాలనీలో వీధిలైట్లు వెలగకపోవడంతో చీకటిలో సంచరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. చీకటి పడితే జెర్రిలు, పాములు తదితర విషకీటకాలు సంచారం అధికంగా ఉంటుందని, దీంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని ఆవేదన చెందుతున్నారు. చీకట్లో పడుకుంటున్న వీధికుక్కలను గమనించిక తొక్కుతుండడంతో ప్రజల మీద దాడి చేస్తున్నాయని చెబుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. త్వరితగతిన స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సవ్యంగా నడుచుకోక పోతే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గొలగాని అప్పారావు

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నేర చరిత్ర గల వ్యక్తులకు ఆదివారం స్టేషన్ వద్ద సీఐ గొలగాని అప్పారావు కౌన్సెలింగ్ ఇచ్చారు. జాగ్రత్తగా మసులుకోవాలని, ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నట్టు ,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా నడుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వారికి మంచి పేరు తెచ్చే విధంగా మసులు కోవాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ లక్ష్మణరావు, సీఐ అప్పారావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు తదితరులు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రాతఃకాలం నుంచి స్వామివారికి సహస్రనామార్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక కాపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో మజ్జి మాలినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి సంఘ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేసి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పేద విద్యార్థులకు పలకలు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఇక్కడ బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు గొర్లె అప్పలస్వామి నాయుడు, ఆళ్ల పైడిరాజు, నారిపిన్ని సత్తిరాజు, జాలాది విజయ, బాల సుబ్రహ్మణ్యం, నరేంద్ర, చంగల్ చిన్నారావు తదితరులు విద్యార్థులకు పుస్తకాలు, పలకలు అందించారు. బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జీవిత విశేషాలు, వారు చేపట్టిన సంస్కరణల గురించి వివరించారు.

ఘనంగా సాగరిగిరి కనక దుర్గ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో సాగరిగిరి కనకదుర్గమ్మ

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరిగిరి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఆలయ ఆవరణలో వెలసిన శివాలయంలో ఈశ్వరుడికి రుద్రాభిషేకం జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు



నడక పోటీలు ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కంచరపాలెం: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సర్వోత్తమ సుకుమార్, అధ్యక్షుడు జయతి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో జిల్లా స్థాయి 4కే–2025 నడక పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 ఇంటర్నేషనల్ గవర్నర్ కె. ద్వారకానాథ్ పాల్గొని జెండా ఊపి నడక పోటీలను ప్రారంభించారు. 30 ఏళ్ల నుండి 80 ఏళ్ల వయసు కలిగిన సుమారు 265 మంది స్త్రీ, పురుషులు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముందుగా ఇంటర్నేషల్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్, ప్రముఖ సామాజిక సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త రౌతు ఆదినారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నడక పోటీల్లో విజేతలకు త్వరలో జరిగే వార్షికోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు జె. రమేష్‌కుమార్, కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్, కోశాధికారి కిషోర్‌కుమార్, సహ కార్యదర్శి ఇమ్మానుయేల్, శిలపరశెట్టి సూర్యారావు, లక్ష్మీరెడ్డి, డాక్టర్ కె.రామకృష్ణ, బి.శ్రీధర్, శివకామేశ్వరి, డాక్టర్ ఎస్.బి.సంతోష్ కమిటీ బోర్డు కో–ఆర్డినేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ తొలేళ్ల ఉత్సవం



పుట్ట బగారం వద్ద పూజలు చేస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: గొల్లల పాలెం ఇందిరానగర్‌లో మోదకొండమ్మ అమ్మవారి పండగ వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు ఆదివారం 'పుట్ట బంగారం తీత' కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం, గ్రామ పెద్దలు, మహిళలు కలిసి పుట్ట బంగారం తీసి, అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. స్థానిక మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. పలు వీధుల్లో మేళతాళాల నడుమ ఘటాలను ఊరేగించే భక్తుల పాదాలను పసుపు నీటితో కడిగి పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఈ విధంగా ఊరేగింపు నిర్వహించడం సంప్రదాయమని, అమ్మవారి కృప అందరిపై ఉంటుందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ప్రధాన పండగ సందర్భంగా గోపాలపట్నం పరిసర 14 గ్రామాల ప్రజలు తరలివస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ప్రధాన పండుగ రోజు భక్తులకు స్వయంగా సేవలు అందించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పలువురు భక్తులు అమ్మవారి పండుగ సందర్భంగా ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగలి, పులిహోర వంటి ప్రసాదాలను కూడా అందిస్తారని తెలిపారు.

ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి



రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వామనమూర్తి, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం: ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వేస్టేషన్ పోస్టాఫీసు జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిన వారికి, ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన ఆటో డ్రైవర్లకు ఈ కరెంటు బిల్లు లింకు సాకు చూపి తల్లికి వందనం ఎగ్గొట్టడం, మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విశాఖలో ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందే ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం డబ్బు బ్యాంకుల్లో వేయాలని డిమాండ్ చేశారు.

ఫాదర్లకు వీడ్కోలు



సహాయక ఫాదర్లను సత్కరిస్తున్న జ్ఞానాపురం ప్రజలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పారిస్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో సహాయ విచారణకర్తలకు ఆదివారం ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు వైజాగ్ ఆర్చ్ డయాసిస్ క్యాథెడ్రల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకల్లో ఏడాది కాలం పాటు పని చేసి జ్ఞానాపురం ప్రజల మన్ననలు చూరగొన్న సహాయ విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్లు వినయ్‌కుమార్, అంథోనీ రాజ్‌లను ఘనంగా సత్కరించారు. ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు సువార్తను బోధించుటలో చిత్తశుద్ధి, అంకితభావంతో వీరు పనిచేసి, అధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరగడానికి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు, వ్యాఖ్యాత పాలమరశెట్టి ఫ్రాన్సిస్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి గ్లోబల్ యాప్‌తో అభ్యున్నతి

సీతంపేట: పద్మశాలీల అభ్యున్నతికి పద్మశాలి గ్లోబల్ యాప్ ఎంతో ఉపయోగపడే డిజిటల్ వేదిక అని పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మేరువ వెంకటేశ్వర్లు, స్వాతి సైన్స్ ఒంగోలు చైర్మన్ కవరతపు ప్రసాదరావు, రోఎస్‌బిటీ సొల్యూషన్స్ డైరెక్టర్ గోలి తిరుపతిరావు, కర్నూలు మాజీ ఎంపీ సింగరి సంజీవ్ కుమార్ అన్నారు. శంకరమఠం రోడ్‌లో ఉన్న పద్మశాలి భవన్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని పిలుపు నిచ్చారు. పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ గర్వకారణమైన విషయమన్నారు. ఈరోజు నుంచి పద్మశాలి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవుతుందని తెలిపారు. భౌగోళిక సరిహద్దులు చెరిపేసి గ్లోబల్ పద్మశాలి కుటుంబ నిర్మాణానికి దోహదపడిన రోజని పేర్కొన్నారు. నాటి మగ్గం నుంచి నేటి సాంకేతిక విజ్ఞానం దాకా పద్మశాలీయుల ప్రతిభ సమాజానికి సేవ చేస్తోందన్నారు. ఈ యాప్ ద్వారా పద్మశాలి కులస్తుల సాధికారత, వివాహ సంబంధాలు, వేడుకలు, అభిప్రాయ సేకరణ, ఎన్నికల నిర్వహణ, సమస్యల పరిష్కారం, పేద పద్మశాలి కుటుంబాలకు సహాయం, పద్మశాలి సంస్కృతి రాబోయే తరానికి అందిచండం లక్ష్యంగా యాప్ సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, బురిడి కల్యాణి, కొప్పుల రమేష్ వానపల్లి ఈశ్వరరావు, రాపర్తి సుబ్బారావు, కొప్పుల రామ్‌కుమార్, కోడిదాసు శ్రీనివాసరావు, పలువురు పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు

మురళీనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, ఎస్.వరప్రసాద్ తెలిపారు. 18న భజన మహా భాగవతం, 19న భజన శ్రీమద్భగవద్గీత, 20న కుంకుమ పూజ, 21న భజన నిర్వహిస్తామని తెలిపారు.

సండే సందడి



ఊయల ఊగుతున్న చిన్నారులు



మినీ రంగులరాట్నం ఎక్కిన చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని చిల్డ్రన్ పార్కు ఆదివారం చిన్నారులతో కిట కిటలాడింది. సెలవు కావడంతో పలు ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు వారి చిన్నారులను పార్కుకు తీసుకు వచ్చారు. దీంతో పిల్లలు సందడి చేశారు. చిన్నారుల కేరింతలు, ఆటపాటలతో చిల్డ్రన్ పార్కు సందడిగా మారింది. సాయంత్రం చిన్నారుల సందడి ఓ వైపు, పెద్దలు కాలక్షేపం, కబుర్లతో ఉత్సాహంగా గడిపారు.

పట్టుదల, క్రమశిక్షణతో విజయం సొంతం

సీతంపేట: లక్ష్య సిద్ధి, పట్టుదల, ప్రణాళికాబద్ధమైన కృషితో చదివితే తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో విజయం సాధించవచ్చని ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ హెచ్‌వోడీ అడ్మిన్ అవినాష్, డైరెక్టర్ వివేకానంద్ అన్నారు. రామా టాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీయ ప్రేరణ, సరైన గైడెన్స్‌తో రెండేళ్ల పాటు చదివితే సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన తక్కువగా ఉందన్నారు. సివిల్స్‌లో ర్యాంకుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తుందన్నారు. గత ఏడాది వందలోపు ఒక్క ర్యాంకు కూడా రాలేదని, ఈ సంవత్సరం వందలోపు ఒక్క ర్యాంకు మాత్రమే వచ్చిందన్నారు. తెలంగాణలో ర్యాంకుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతున్నట్లు తెలిపారు. దీనికి కారణం ఆంధ్రాలో తక్కువ మంది విద్యార్థులు సివిల్స్ వైపు వెళ్తున్నారని గుర్తించి విశాఖలో సివిల్స్‌కు ఎలా సన్నద్ధం కావాలో తెలియజేసేందుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సంస్థ 2021లో హైదరాబాదులో స్థాపించామని, నాలుగేళ్లలో 68 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావడం, నోట్సు చదవడం, టెస్టులు రాయడం ఇలా ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే తొలి ప్రయత్నంలో విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతాల్లో బెల్టు షాపుల దందా

- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, మహిళలు
- కన్నెత్తి చూడని అధికారులు



నక్కవానిపాలెం సేవా మార్గంపై దర్జాగా మద్యం సేవిస్తున్న వ్యక్తులు



గుల్లలపాలెం మీ సేవా పాత భవనం వద్ద మద్యం సీసాలు సేకరిస్తున్న దృశ్యం



మల్కాపురంలో మరిడిమాంబ వైన్ షాపునకు అనుకుని మందుబాబుల కోసం ఏర్పాట్లు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం బెల్టు షాపులు, బహిరంగ మద్యం సేవనంతో అస్తవ్యస్తంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు ఎక్కువయ్యాయి. ప్రధాన సర్వీసు రోడ్లపై మద్యం దుకాణాలు నిత్యం మద్యం సేవించేవారితో కిటకిటలాడుతుండడంతో ఆ మార్గంలో వెళ్లే పాదచారులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 'సాయంత్రం అయితే చాలు, ఈ రోడ్లలో నడవాలంటేనే భయమేస్తోంది. ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లే, తాగుబోతుల గోలే అని మల్కాపురానికి చెందిన ఓ మహిళ వాపోయింది.

నిబంధనలకు పాతర

మల్కాపురం సర్వీసు రోడ్డులో వరుసగా నాలుగు వైన్ షాపులు ఉండగా, వాటిలో మరిడిమాంబ, కృష్ణ వైన్స్ షాపుల వద్ద నిబంధనలను తుంగలో తొక్కి లూజు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా ఈ షాపులకు అతి సమీపంలోనే మద్యం సేవించేవారి కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి బార్‌లుగా నడిపిస్తున్నారు. వైన్ షాపుల వద్ద కేవలం మద్యం కొనుగోలు మాత్రమే చేయాలి. కానీ వ్యాపారులు తమ వ్యాపారాలను పెంచుకునేందుకు అక్రమ మార్గాలను అనుసరిస్తున్నారు.

మందు బాబులకు అడ్డాగా.

మద్యం సేవించేవారు వైన్ షాపుల ముందు, పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపై బహిరంగంగా మద్యం సేవించినా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. ఆర్.కె.పురం వద్ద గల వైన్ షాపు పక్కన నిరుపయోగంగా ఉన్న పాత పెట్రోల్ బంకును మద్యం ప్రియులు బహిరంగంగా మద్యం సేవించే అడ్డాగా మార్చుకున్నారు. అదేవిధంగా నక్కవానిపాలెం వద్ద కూడా పగలు, రాత్రి అనే తేడా లేకుండా బహిరంగంగా మద్యం సేవించేవారి సంఖ్య పెరుగుతోంది.

పోలీసుల మౌనం

మల్కాపురం, ఆర్.కె.పురం, శ్రీహరిపురం వద్ద గల వైన్ షాపుల వద్ద బహిరంగంగా మద్యం సేవించడం పోలీసులకు తెలిసినా వారు మౌనం వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ షాపుల వెనుక కూటమి నాయకుల అండదండలు ఉండటంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. 'ఎందుకు వచ్చిన తలనొప్పి' అన్నట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

అధికారులు స్పందించాలి

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పారిశ్రామిక ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ మద్యం సేవనాన్ని అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మల్కాపురం సేవా మార్గం వద్ద గల ఫుట్‌పాత్‌పై మద్యం సేవిస్తున్న వ్యక్తులు

పాలస్తీనా సంఘీభావ సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష దాడి, మానవ హననాన్ని నిరసిస్తూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం నిర్వహించనున్న సభలో పాల్గొనాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపాన సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్, సీపీఐఎంఎల్ ప్రజాపోరు కార్యదర్శి కె.దేవసహాయం, సీపీఎం కార్యదర్శి బి.పద్మ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.మన్మథరావుతో కలిసి మాట్లాడారు. ప్రపంచ పటం నుంచి పాలస్తీనా దేశాన్ని తొలగించాలనే కుట్రతో ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని తెలిపారు. మారణ హోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండింటిని స్వతంత్ర దేశాలుగా గురించాలన్నారు.